క్లుప్తంగా

వన సమారాధనలు ఐక్యతకు ప్రతీక



అంబాజీపేటలో ఉసిరి చెట్టువద్ద పూజలు నిర్వహిస్తున్న వ్యాపారులు

అంబాజీపేట: కార్తీక వనసమారాధనలు ఐక్యతకు ప్రతీకని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంబాజీపేట కొబ్బరి నూనె మిల్లులు, వ్యాపారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక వెంకట్రాజు ఆయిల్ అండ్ ఫ్లోర్ మిల్ ఆవరణలో శనివారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఉసిరిచెట్టు వద్ద అర్చకుడు మర్ల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో కార్తీక దామోదరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో గణపతి వీరరాఘవులు, అధికారపు బాబ్జి, గణపతి బాబి, వర్రే చింతన్న తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ఉచిత శిక్షణ

ఆలమూరు: గ్రామ శివారు స్థానిక కొత్తూరు సెంటర్‌లో మార్షల్ ఆర్ట్స్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 27న ప్రపంచ మార్షల్ ఆర్ట్స్ సృష్టికర్త బ్రూస్లీ జయంతి పురస్కరించుకుని ఈనెల 27 నుంచి స్థానిక బస్టాండ్ సెంటర్ పక్కన ఉన్న రైసు మిల్లు ఆవరణలో ఈ ఉచిత శిక్షణను ఇవ్వనున్నామన్నారు. ప్రతిరోజు ఉదయం ఆరు నుంచి రాత్రి 7.30 వరకు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. ఆలమూరు శివారు ప్రాంతమైన కొత్తూరు సెంటర్ బస్టాండ్ పక్కన రైస్ మిల్లు వద్ద నిర్వహిస్తున్నామన్నారు. యువతీ యువకులకు, చిన్నారులకు శారీరక ఉల్లాసాన్ని ప్రశాంతతను కలిగించే కరాటే, మార్షల్ ఆర్ట్స్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహిస్తున్న జడ్జి

ఆలమూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో రాబోయే డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో న్యాయాధికారులు, పోలీసులతో శనివారం సమీక్ష జరిగింది. జడ్జి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వీలైనంత మేరకు కక్షిదారుల మధ్య స్నేహ పూర్వక వాతావరణంలో సయోధ్య కుదిర్చి కేసులు పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం జాతీయ లోక్ అదాలత్‌పై ప్రత్యేక దృష్టి సారించినందున ఆ మేరకు న్యాయ సాధికారిత సభ్యులు, పోలీసు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితులు ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటికబెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

శనైశ్చరునికి ప్రత్యేక పూజలు



శనైశ్చరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దేవదాయ, ధర్మాదాయశాఖ ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ముందుగా అర్చకులు, వేద పండితులు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. పూజలు, తైలాభిషేకాల టిక్కెట్లు ద్వారా రూ.1,44,640, అన్నప్రసాదానికి విరాళాలు రూపంలో రూ.38,374తో కలిపి మొత్తం దేవస్థానానికి రూ.1,82,974 ఆదాయం వచ్చినట్లు డీసీఅండ్ఈఓ సూర్యచక్రధరరావు తెలిపారు.

గొర్రెల మందకు తగ్గని ఆదరణ

- విసర్జితాలతో పంటలకు బలం
- భూసారం పెంచుకునేందుకు రైతుల్లో ఆసక్తి
- తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం



గొర్రెలకు ఉదర పోషణ

గుమ్మిలేరులో పంట పొలాల్లో గొర్రెల మంద

ఆలమూరు: వ్యవసాయ రంగంలో అధునాతన పద్ధతులతో కొత్త పుంతలు తొక్కుతున్నా కొంతమంది రైతులు మాత్రం అలనాటి పద్ధతులనే పాటిస్తున్నారు. ఎరువుల భారం ఏటా పెరిగిపోతుండటంతో వ్యవసాయం భారంగా మారింది. దీంతో రైతులు పెట్టుబడిని తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయంగా పాత పద్ధతులకు పెద్దపీట వేస్తున్నారు. గొర్రెల మందలను పొలాల్లో కట్టి వాటి మల విసర్జితాలను ఎరువుగా ఉపయోగించే పద్ధతులను ఇటీవల రైతులు ముమ్మరం చేశారు. దీంతో ఏటా మాదిరిగానే ఈ ఏడు కూడా గోకవరం, రాజానగరం, కోరుకొండ, ఏలేశ్వరం, రంగంపేట తదితర మండలాలతో పాటు పశ్చిమగోదావరి జిల్లాలోని ద్వారకాతిరుమల, ఏలూరు, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల నుంచి అనేక గొర్రెల మందలు పరిసర ప్రాంతాలకు చేరుకుని వేలాది ఎకరాల్లో మంద కట్టు జరుగుతుంది. దీంతో ఖరీఫ్ ముగిసే సమయానికి సంప్రదాయ రీతిలో పంట పొలాల్లో ఇటీవల గొర్రెలు మందలు అత్యధికంగా కనిపిస్తున్నాయి. గొర్రెల మందలను ఎకరాకు రూ.వెయ్యి వరకూ వెచ్చించి రెండు, మూడు రోజుల పాటు చేలల్లో ఉంచి భూ సారాన్ని పెంచుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

గొర్రెల కాపరులు తమ గొర్రెలకు ఆహారం నిమిత్తం గొర్రెలను ఆహారం దొరికే ప్రాంతాలకు తోలుకుని వెళ్తుంటారు. ముఖ్యంగా ఖరీఫ్ పూర్తయిన తర్వాత గొర్రెల కాపరులు తమ గొర్రెల మందలతో వస్తుంటారు. ఖరీఫ్‌కు, రబీకి మధ్య కాలంలో పంట పొలాలలో గొర్రెలను తిప్పడం ద్వారా గొర్రెలకు ఉదర పోషణ జరుగుతుంది. అదే సమయంలో గొర్రెలు వేసే మలవిసర్జన కారణంగా పంట పొలాలకు ఎరువుగా ఉపయోగ పడడంతో రైతులకు, గొర్రెల కాపరులకు ఉభయతారకంగా ఉంటుంది. ప్రస్తుతం గొర్రెల మందలను పంట పొలాలలో మంద కట్టేందుకు రైతులు మునుపెన్నడూ లేని విధంగా రైతులు ఆసక్తి చూపుతున్నారు. రైతులు కనీసం ఒక రోజైన తమ పంట పొలాల్లో గొర్రెల మంద కట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు

గొర్రెల మందలను కిలోమీటర్ల కొద్ది తరలించుకు రావడం వల్ల కాపరులకు వ్యయప్రయాసలు అధికమవుతున్నాయి. గంటల తరబడి రోడ్లపై నడిచే గొర్రెలను సంరక్షించుకునే సమయంలో గంటల తరబడి ప్రయాణించవలసి ఉంటుంది. దీనివల్ల గొర్రెల కాపరుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తినా గొర్రెలకు ఉదర పోషణ జరుగుతుందనే ఉద్దేశంతో సుదూర ప్రాంతాలకు గొర్రెలను తీసుకు వస్తున్నారు. ఒక్కోసారి గొర్రెలు గాయాలబారిన పడటంతో కాపరులు తీవ్ర ఇబ్బందులు పడవలసిన పరిస్థితి. గొర్రెల మందలు గంటల తరబడి రోడ్ల పైనే ప్రయాణించడం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అలాంటి సమయంలో ప్రయాణికులు సహనం కోల్పోయి గొర్రెల కాపరులతో వాగ్వివాదానికి సైతం దిగిన పరిస్థితులు అనునిత్యం తారసపడుతుంటాయి.

ఆదరణ పెరిగింది



గొర్రెల మందలకు పల్లె ప్రాంతాల్లో ఎల్లప్పుడూ ఆదరణ ఉంటుంది. కష్టసాధ్యమైన, గిట్టుబాటు కాకపోయినా సుదూర ప్రాంతాల నుంచి తమ గొర్రెల మందలను మైదాన ప్రాంతాలకు తీసుకువచ్చి ఉదర పోషణ జరుపుకుంటున్నాం.

– సీహెచ్ ఏడుకొండలు, చేబ్రోలు, ఏలూరు జిల్లా

పంట పొలాలకు ఎంతో మేలు



పంట పొలాల్లో ఖరీఫ్ సాగుకు రబీ సాగుకు మధ్య సమయంలో గొర్రెల మందను కట్టడం ద్వారా ఉదర పోషణ జరుగుతుంది. దీంతో ఎరువులు వేయకుండానే చేనుకు కావలసిన భూసారాన్ని పెంచుకునే అవకాశం ఉంటుంది. సంప్రదాయ పద్ధతిలో భాగంగా గొర్రెల మందకు ఎప్పటికి ఆదరణ అదే విధంగా ఉంటుంది.

– నామాల వెంకటేశ్వర్లు, రైతు, పినపళ్ల

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి



అంతర్వేది దేవస్థానం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన డిప్యూటీ డీఈవో ప్రకాష్

సఖినేటిపల్లి: పదో తరగతి పరీక్షలలో ఉపాధ్యాయుల సూచనలు పట్టి ప్రణాళికా బద్ధంగా చదువుకుని, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోనసీమ జిల్లా ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాష్ అన్నారు. శనివారం పల్లిపాలెం ఆశ్రమ పాఠశాల, అంతర్వేది దేవస్థానం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఆయా పాఠశాలలో విద్యార్థులను అన్ని సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి డిప్యూటీ డీఈవో సమాధానాలు రాబట్టారు. అలాగే పాఠశాలలో సమావేశాలు నిర్వహించి బోధన సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. హెచ్‌ఎంలు ఎం.రత్నరాజు, డి.ప్రసాద్, టీచర్లు ప్రేమ్‌చంద్, రాంబాబు, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

సత్యసాయి సమితి సేవా కార్యక్రమాలు ఆదర్శం

100 మంది పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, టవల్స్, కంచాలు, బాక్సుల పంపిణీ



కొత్తపేటలో పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, కంచాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ రాజు, డాక్టర్ గాంధీ తదితరులు

కొత్తపేట: స్థానిక సత్యసాయి సేవాసమితి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు, ప్రముఖ వైద్యుడు సత్యవరపు విశ్వనాథగాంధీ అన్నారు. భగవాన్ పుట్టపర్తి సత్యసాయిబాబా జయంతి పురస్కరించుకుని కొత్తపేట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ వివిధ ఆధ్యాత్మిక, సేవా, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సత్యసాయి ప్రశాంతి నిలయంలో సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణ (కేఎస్ఎన్) ఆధ్వర్యంలో, సభ్యుల పర్యవేక్షణలో తొలుత నగర సంకీర్తనలో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మందిరం ఆవరణలో ప్రశాంతి పతాకాన్ని సమితి సభ్యుడు టి.నాగభూషణరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం బాలవికాస్ బాలలతో మహిళా సభ్యులు జ్యోతి ప్రజ్వలనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సభలో ముఖ్యఅతిథులు మాట్లాడుతూ 'మానవసేవే మాధవసేవ' అని సత్యసాయిబాబా ఆచరించిన కార్యక్రమాలను ఈ సేవా సమితి వారు స్ఫూర్తిగా తీసుకుని అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. వారి చేతులు మీదుగా కొత్తపేట, వాడపాలెం, వానపల్లి, అవిడి తదితర గ్రామ పంచాయతీలు, కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన వంద మంది పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, టవల్స్, స్టీలు కంచాలు, బాక్సులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన జరిపారు. కార్యక్రమాల్లో సమితీ సీనియర్ సభ్యుడు సుతాపల్లి లక్ష్మీనారాయణరావు, సభ్యులు చొప్పెల్ల రాంబాబు, ఎస్ఎన్‌యూకే లింగేశ్వరరావు, కంకటాల సాయిబాబా, చింతం రామకృష్ణ, ఎస్.గోపాలరావు, కె.విజయసారథి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: భగవాన్ సత్యసాయిబాబా జయంతి వేడుకలను అంబాజీపేట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మాచవరం, కొర్లపాటివారిపాలెం, అంబాజీపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, రబ్బర్లు, పెన్సిళ్లు, స్వీట్లను పంచారు. అంతకుముందు ఓంకార, సుప్రభాత, నగర సంకీర్తనలు చేశారు. డాక్టర్ ఢిల్లీబాబు ఇంటి వద్ద బాల వికాస్ పిల్లలతో ఉయ్యాల సేవను చేపట్టారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: భగవాన్ సత్యసాయిబాబా జయంతిని పి.గన్నవరం అక్విడెక్టు వద్ద షిర్డీసాయిబాబా వారి ఆలయం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ చొల్లంగి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు సామూహిక సాయి నారాయణ వ్రతాలు చేశారు. సాయంత్రం పల్లకీ ఊరేగింపు జరిగింది. కార్యక్రమాల్లో మాజీ జెడ్పీ చైర్మన్ నామన రాంబాబు, సత్యసాయి సేవాసమితి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నచ్చిన మిల్లులకు రైతులు ధాన్యం అమ్ముకోవచ్చు



చిరతపూడిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

అంబాజీపేట: ఖరీఫ్ పంటలో వచ్చిన ధాన్యాన్ని రైతులకు నచ్చిన రైస్ మిల్లులకు అమ్ముకోవచ్చని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి చెప్పారు. చిరతపూడిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. తహసీల్దార్ వెంకటేశ్వరి మాట్లాడుతూ మండలంలో ఎంటీయూ 1318, ఎంటీయూ 7029 రకాల వరి పంటలను రైతులు పండిచారన్నారు. మండలంలో 7,411 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని, ఇప్పటి వరకు 48 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు విక్రయించుకున్నారన్నారు. మండలంలో చిరతపూడితో పాటు గంగలకుర్రు, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, ముక్కామలలో ఉన్న ఆరెస్కేలు, సొసైటీల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే రైతులు ధాన్యాన్ని విక్రయించుకోవచ్చన్నారు. ప్రభుత్వం ప్రకటించిన తేమ శాతానికి అనుగుణంగా ధాన్యాన్ని విక్రయ కేంద్రాలకు తీసుకువచ్చి పరీక్షించుకోవాలన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చేలా చూసి వారికి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, ఆర్బీకే, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీలకు అన్ని సౌకర్యాలూ కల్పించాలి



కొత్తపేట సబ్‌జైలులో సౌకర్యాలపై ఆరా తీస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్‌బాబు

కొత్తపేట: రిమాండ్ ఖైదీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని రాజమహేంద్రవరం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు సబ్‌జైలు అధికారులు, సిబ్బందికి సూచించారు. శుక్రవారం రాత్రి ఆయన స్థానిక సబ్‌జైలును ఆకస్మికంగా సందర్శించారు. లోపల అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ముఖ్యంగా సెల్స్, బాత్ రూమ్స్, వంటషెడ్ పరిశీలించి, అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అనంతరం రిమాండ్ ఖైదీల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడుతూ ఇక్కడ మీకేమైనా ఇబ్బందులు ఉన్నాయా? పోలీసు వారు, సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారా? అని ప్రశ్నించారు. అవగాహన లేకో, క్షణికావేశంలోనో తప్పులు, నేరాలు చేస్తారు. వాటి గురించి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. ఆ తప్పులు, నేరాలు మళ్లీ చేయకుండా, సత్ప్రవర్తనతో మెలిగి, భవిష్యత్ జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందమయం చేసుకోవాలని సూచించారు.

వారాహి అమ్మవారికి లక్ష గాజులు, పుష్పార్చన

కొత్తపేట: స్థానిక బోడిపాలెం వంతెన వద్ద వేంచేసిన విజయదుర్గ ఆలయం ప్రాంగణంలో కార్తిక బహుళ అష్టమి శనివారం వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. దుర్గాదేవి ఆలయ కమిటీ పర్యవేక్షణలో వేదపండితులు వెలువలి వెంకటశివరామ్ (శివాజీ), ఖండవల్లి పాండురంగాచార్యుల ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన వేదపండితులు, స్మార్త పురోహితులు, భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకూ వివిధ పూజలు నిర్వహించారు. వారాహి అమ్మవారికి సామూహిక లక్ష పుష్పార్చన, లక్ష గాజులతో అర్చన, మహిళలతో సామూహిక సహస్ర నామ కుంకుమార్చన జరిపించారు. కార్యక్రమాల్లో కొత్తపేట పరిసర గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు, పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరం ప్రారంభించిన సర్పంచ్ మేడిచర్ల వల్లీశ్వరి

మలికిపురం: మండలంలోని మేడిచర్లపాలెంలో శనివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. సర్పంచ్ మేడిచర్ల వల్లీశ్వరి ఈ శిబిరం ప్రారంభించారు. ఎఫ్ఎంపీఎఫ్ విశ్వాసుల ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో రాజోలు రామకృష్ణ పరమహంస కంటి ఆసుపత్రి వైద్యులు నిర్వహించిన శిబిరంలో 50 మందికి పరీక్షలు చేసి ఏడుగురిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. మాజీ సర్పంచ్ మేడిచర్ల శ్రీనివాస్, పాస్టర్ జి.ప్రకాష్‌బాబు, పాస్టర్ వై.యెుషయా తదితరులు పాల్గొన్నారు.

అప్పనపల్లికి పోటెత్తిన భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. కార్తిక మాసం కావడంతో ఆలయానికి భారీగా తరలి వచ్చారు. సుప్రభాత సేవ, తొలి హారతి కార్యక్రమాల్లో విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.3,91,480 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. 6,500 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, నాలుగు వేల మందికి అన్నదానం చేశామన్నారు. లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.91,470 ఆదాయం రాగా, నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.65,470 విరాళాలుగా సమర్పించారన్నారు.

టెక్నాలజీ వినియోగంలో జాగ్రత్తగా ఉండాలి

కొత్తపేట: విద్యార్థులు టెక్నాలజీ వినియోగంపై జాగ్రత్తగా ఉండాలని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ ఎం.దుర్గాప్రసాద్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అండ్ కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై సైబర్ బుల్లియింగ్, సోషల్ మీడియా ప్రభావం (మెంటల్ హెల్త్ ఆఫ్ సైబర్ బులింగ్ అండ్ సోషల్ అబ్యూజ్) అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కేపీ రాజు అధ్యక్షత వహించగా, స్థానిక ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ దుర్గాప్రసాద్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీ వినియోగం పట్ల జాగ్రత్తగా ఉండాలని, వాట్సాప్, ఫేస్‌బుక్, తదితర సోషల్ మీడియా వేదికల్లో వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వకూడదని, వీటి దుర్వినియోగం వల్ల విద్యార్థుల మానసిక పరిస్థితి దెబ్బతింటుందని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు డాక్టర్ అంకమ్మరావు, డాక్టర్ కె.సత్యనారాయణ, కేఎస్ఎన్ ప్రసాద్, కావ్య, సత్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పునర్నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర బడ్జెట్



కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట: ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఆ దిశగా రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట కాపు కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని, 2024–29 టూరిజం పాలసీ ప్రవేశపెట్టిందన్నారు. కేరళ తరహాలో కోనసీమలో టూరిజం అభివృద్ధి చేస్తామని, పీపీపీ మోడల్లో రూ.25 వేల కోట్ల పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యమని, పర్యాటకం ద్వారా 20% ఉపాధి కల్పన జరుగుతుందని తెలిపారు. కోనసీమను ఎకో, టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేయాలని కోరామన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడం కోసం వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే దిశగా పని చేస్తామన్నారు. కోనసీమకు సాగునీరు, తాగునీరు అందించే లొల్ల లాకుల ఆధునీకరణ చేపట్టాలని రూ.77 కోట్లతో ప్రభుత్వానికి నివేదించానని, అసెంబ్లీలో ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. గోదావరి వరదల నుంచి రక్షణ కోసం లంక గ్రామాల్లో గ్రోయన్లు నిర్మించాలని అసెంబ్లీలో ప్రభుత్వానికి నివేదించానన్నారు. సమావేశంలో మండల టీడీపీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, మందపల్లి మాజీ సర్పంచ్‌లు చింతం విజయకృష్ణ మోహన్, సిద్ధంశెట్టి వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

ఆలమూరు: మండలంలోని మడికిలో శనివారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారులు చెల్లబోయిన సురేష్, చెల్లబోయిన పోతురాజు, వల్లి కృష్ణ కిరణ్ నేతృత్వంలో స్థానిక పోలేరమ్మ ఆలయ ఆవరణ వద్ద అయ్యప్ప భక్తులు ఈ పడిపూజను ఏర్పాటు చేశారు. గురుస్వామి దొండపాటి సుబ్బరాజు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి పూజలు, అభిషేకాలు జరిపారు. బడుగువానిలంక గ్రామానికి చెందిన కొమ్ముల శివ స్వామి భక్తి భజన గీతాలు ఆలపించారు. గురు స్వాములు గారపాటి శివన్నారాయణ, చెల్లుబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

అయినవిల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్, జెడ్పీ ఈసీఓ వీవీఎస్ లక్ష్మణ్‌లు శనివారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రత్యేక క్యాంపులు ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అయినవిల్లి, మాగాం గ్రామాల్లోని జెడ్పీ సీఈఓ వీవీఎస్ లక్ష్మణ్ 196, 197, 198, ఆర్డీఓ పి. శ్రీకర్ 178, 179 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడి బూత్ లెవల్ అధికారులతో సమీక్షించారు. బూత్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్లు లిస్టు పేరు మార్పులు, కొత్తగా ఓటర్లరు నమోదు చేయించుకోవచ్చన్నారు. వీరి వెంట తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఆర్ఐ రాయుడు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



పెదపళ్లలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజు తదితరులు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మంజూరైన రూ.2.47 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎ.రాజు కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. మండలంలో జరుగుతున్న పెదపళ్ల, పెనికేరు, కలవచర్ల గ్రామాల్లోని సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. పనుల నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తొలివిడతగా ఎన్ఆర్ఈజీఎస్ నుంచి పది గ్రామాల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. ఇప్పటి వరకూ ఏడు గ్రామాల్లో పనులు పూర్తి కాగా మూడు గ్రామాల్లో జరుగుతున్న పనులు తుదిదశకు చేరుకున్నాయన్నారు. వచ్చే ఏడాది జనవరిలో రెండో విడత నిధులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఏపీఓ జి.అరుణకుమారి, మండల ఇంజినీరింగ్ జేఈ డి.వీరభద్రరావు, గ్రామ కార్యదర్శులు వి.వేణి, జె.అయ్యన్న పాల్గొన్నారు.

మల్లేశ్వరునికి లక్ష బిల్వార్చన

అంబాజీపేట: గంగలకుర్రులో వేంచేసిన సర్వమంగళ పార్వతీ సమేత చిన్నమల్లేశ్వరస్వామి, ఉమా సమేత ఆనందేశ్వర స్వామి వార్లకు శనివారం లక్ష బిల్వార్చన చేశారు. అలాగే మాచవరం పార్వతీ రాజరాజేశ్వరి స్వామి, కందుల మల్లేశ్వర స్వామి, పుల్లేటికుర్రు వ్యాఘ్రేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, లక్ష పత్రి పూజలు చేశారు. నందంపూడి, తొండవరం, వాకలగరువు, చిరతపూడి తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

మడికిలో..

ఆలమూరు: మండలంలోని మడికిలో హరిహర మహాక్షేత్రంలో కొలువైన బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం లక్ష బిల్వార్చన జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు, శైవాగమ పండితుడు కొళ్లకూరి కామేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఈ లక్ష మారేడు బిల్వార్చన జరిగింది. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఈ లక్ష మారేడు బిల్వార్చనను భక్తి శ్రద్ధలతో తిలకించారు.

మడుపల్లిలో...

అయినవిల్లి: మండలంలోని మడుపల్లిలోని ముక్తీశ్వరస్వామివారి ఆలయంలో శనివారం లక్ష బిల్వార్చన పూజలు జరిపారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు, అభిషేకాలు జరిపారు. దీపార్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే నేదునూరు చెన్నమల్లేశ్వరుని ఆలయంలో విశేష పూజలు జరిపారు.

స్వర్ణ పంచాయతీ కార్యక్రమంపై సమీక్ష

మామిడికుదురు: స్వర్ణ పంచాయతీ కార్యక్రమాన్ని డీపీఓ డి.శాంతలక్ష్మి శనివారం సమీక్షించారు. ఆమె మామిడికుదురు పంచాయతీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. పంచాయతీల ద్వారా వసూలు చేసే హౌస్ ట్యాక్సుల వివరాలు తెలుసుకున్నారు. స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ రికార్డులను ఆన్‌లైన్ చేస్తున్నారు. దీనిపై సమీక్ష జరిపారు. సాధ్యమైనంత త్వరగా స్వర్ణ పంచాయతీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు పీవీఎస్‌వీ ప్రసాద్, పీవీఆర్‌కే వర్మ ఉన్నారు.

చర్మవ్యాధుల ఉచిత వైద్య శిబిరం

కొత్తపేట: మెడ్ యునైటెడ్ వైద్య సంస్థ స్థానిక బ్రాంచ్ వద్ద శనివారం ఉచిత చర్మవ్యాధుల ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ రమీజ్‌రాజా చర్మవ్యాధితో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి పలు జాగ్రత్తలు సూచించారు. ఉచితంగా మందులు అందజేశారు. కొత్తపేట పరిసర ప్రాంతాల నుంచి సుమారు 200 మంది ఈ వైద్య సేవలు పొందారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన ఏడిద ఆదినారాయణ–సత్యవతి దంపతులు రూ.11 వేలు, అమలాపురానికి చెందిన సాంబశివశాస్త్రి–సావిత్రి దంపతులు శనివారం రూ.25 వేలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు సత్తిబాబుకు అందజేశారు. దాతలు ఆదినారాయణ, సాంబశివశాస్త్రి దంపతులను వేదమంత్రాలతో సత్కరించి, ఆశీర్వచనం అందజేశారు. దాతలకు స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

సహకార వ్యవస్థను బలోపేతం చేయాలి

ఆలమూరు: రైతులకు అభ్యున్నతికి దోహదపడే సహకార వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చైర్‌పర్సన్ గండి పద్మ అన్నారు. ఆమె అధ్యక్షతన శనివారం స్థానిక సమత మహిళ పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం కార్యాలయం ఆవరణలో శనివారం సహకార వ్యవస్థపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి సీఈఓ వై.దాసు అధ్యక్షత వహించగా చైర్‌పర్సన్ పద్మ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఎన్టీఆర్ ప్రభుత్వంలో సహకార వ్యవస్థ బలోపేతమైందన్నారు. సహకార వ్యవస్థ ద్వారా తీసుకున్న రుణాలు తిరిగి సక్రమంగా చెల్లించడం ద్వారా సంస్థ అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు, అలాగే లబ్ధిదారులు జీవన ప్రమాణాలకు మెరుగుపడుతుందన్నారు. సమత మేనేజర్ ఎం.రాము, ఆర్గనైజర్లు బీఆర్ సహవాసరావు, కె.వరలక్ష్మి, ఎస్.వరలక్ష్మి, ఎస్.సురేష్, కేకే రత్నం, బి.నాగమణి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.